క్లుప్తంగా

లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి


జగన్మోహన్‌రెడ్డి

కందుకూరు: పీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా కందుకూరు మండలం జైత్వారం గ్రామానికి చెందిన బైరు జగన్మోహన్‌రెడ్డిని నియమించినట్లు చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ బుధవారం ప్రకటించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు నియామక పత్రం ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. తనకు ఈ పదవి అప్పగించినందుకు అశోక్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించే ప్రతి పనిని నిబద్ధతతో పూర్తి చేసి పార్టీ పటిష్టతకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం


ప్రత్యేక అలంకరణకు స్వామివారు

తుక్కుగూడ: జిన్నాయిగుట్ట ఛత్రగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారికి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఎదుర్కోలు నిర్వహించారు. భక్తులు స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం


మాట్లాడుతున్న మహ్మద్ నయీం

పహాడీషరీఫ్: కేంద్రంలో మరోసారి బీజేపీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని సీనియర్ నాయకుడు మహ్మద్ నయీం పేర్కొన్నారు. మామిడిపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజలను దోచుకున్న బీఆర్ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారన్నారు. ఆరు గ్యారంటీలంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఆరు నెలలకే ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుందన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, దేశాన్ని అగ్రదేశాల సరసన నిలిపారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కమిషనర్ చంద్రశేఖర్

మీర్‌పేట: రానున్న వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలు పరిష్కరించాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. కాలనీల్లో, ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మూతలు లేని మ్యాన్‌హోళ్లను గుర్తించి వెంటనే మూతలు ఏర్పాటు చేయాలన్నారు. శానిటరీ, ఇంజినీరింగ్ అధికారులు, రెస్క్యూటీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌ఓ అంజన్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది. చేవెళ్లకు చెందిన మహేందర్ రెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 320 మంది రోగులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అంజయ్య, శ్రీశైలం, రమేష్, నరేందర్, శివ, కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- వానాకాలంలో అప్రమత్తత అవసరం


అధికారులతో కలిసి మంత్రాల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మీర్‌పేట: చెరువు సుందరీకరణలో భాగంగా పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్‌పేటలోని మంత్రాల చెరువును ఎమ్మెల్యే అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి రెండువైపులా చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు వద్ద ఆకట్టుకునేలా జింకల విగ్రహాలు, నంది విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, మీర్‌పేట అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, సునీత బాల్‌రాజ్ పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు


చెన్నకేశవస్వామి దేవాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక పూజలు

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లి పరిధిలోని లక్ష్మీ చెన్నకేశస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుడు రేవెళ్ల రాజుశర్మ సమక్షంలో ఉదయం మహాగణపతి పూజ, విశ్వక్సేన పూజతో మొదలై అఖండ దీపారాధన, ధ్వజారోహణం, మండప పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం స్వామి వారి తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అర్చకులు తిరునగరి గోపాల్, సాయికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

షాబాద్: ఆడపిల్లకు జన్మనిచ్చిన ప్రతీ మహిళకు తనవంతు ఆర్థిక సాయం అంజేస్తున్నట్లు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన మహిళకు రూ.5,211 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంతో పోల్చుకుంటే అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఆడపిల్లలను జన్మనిచ్చే ప్రతి మహిళ కు తన వంతు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

ఉద్యానశాఖ షాద్‌నగర్ డివిజన్ అధికారి ఉషారాణి


కరపత్రం విడుదల చేస్తున్న ఉషారాణి

కేశంపేట: ఆయిల్‌పామ్ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఉద్యానశాఖ షాద్‌నగర్ డివిజన్ అధికారి ఉషారాణి పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై మండల పరిధిలోని లేమామిడి గ్రామంలోని రైతువేదికలో అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి ఉషారాణి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేస్తే మొక్కకు 90%, డ్రిప్ పైన 100% సబ్సిడీ, అలాగే మొక్కల మెయింటెనెన్స్‌కు ఎకరానికి రూ.4,200లు అందిస్తారని తెలిపారు. ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందని ఆమె తెలిపారు. రైతులు పండించిన పంటలను ఆయిల్‌పామ్ కంపెనీ వారే కొనుగోలు చేస్తారన్నారు. పంటల సాగులో చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగుపై కరపత్రంను విడుదల చేశారు. షాద్‌నగర్ ఏడీఏ రాజరాత్నం, ఆయిల్ పామ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఉద్యానశాఖ ఫీల్డ్ అధికారి రుక్మిణీ, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధా, సమీరా, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి


టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి


కొత్తూరు: టీకా వేస్తున్న వైద్యురాలు స్ఫూర్తి

షాబాద్: పశుసంపదను కాపాడుకునేందుకు రైతులు వాటికి వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో పశువులకు గొంతువాపు వ్యాధి, తొడవాపు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గొర్రెలకు, మేకలకు చిట్టుక వ్యాధి రాకుండా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రైతులకు సూచించారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిట్టుక వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: పశువులు, మేకలు, గొర్రెల పెంపకంలో కాపరులు, రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి కోరారు. బుధవారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో 300 గేదెలకు గొంతువాపు, పెంజర్ల గ్రామంలో గొర్రెలు, మేకలకు చిటికవాపు నివారణ టీకాలను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పశువులు, మేకలు, గొర్రెలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పశువులు అనారోగ్యాలకు గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైతులు చికిత్స చేయించాలని కోరారు. ముఖ్యంగా వీటి పెంపకంలో రైతులు, కాపరులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, సులేమాన్, రవిరాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కొనసాగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్‌వి సత్యనారాయణ తెలిపారు. శ్రీరాం కాలనీ, బృందావన్ కాలనీ, రిలయన్స్ కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జల్‌పల్లి గ్రామం, బేవరేజెస్ వెంచర్, సాదత్‌నగర్, పటేల్ కాలనీ, బాలాజీ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు కలిగే అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పుష్పాగార్డెన్స్, కొత్తపేట, మారుతీనగర్, గంగా హాస్పిటల్, జేబీ.కాలనీ, విశాలాంధ్ర, సౌత్‌ఎండ్‌పార్కు, సీతారామపురం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ శివపార్వతి, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ బీరప్పటెంపుల్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ హుడాకాంప్లెక్స్, ఆర్‌కేపురం, హనుమాన్‌నగర్, నర్సింహపురికాలనీ, చిత్రా లేఅవుట్, రాజీవ్‌స్వగృహ, హుడాసాయినగర్, సీతారామాపురం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు, 11కేవీ శివపార్వతి, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ సాయికాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

కందుకూరులో..

కందుకూరు: కందుకూరు మండలంలో కొన్ని ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు కందుకూరు టూటౌన్ ఫీడర్, దెబ్బడగూడ ఫీడర్ల పరిధిలో, 12 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పులిమామిడి, టౌన్ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో దెబ్బడగూడ, మహ్మద్‌నగర్, పులిమామిడి టౌన్ పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, రైతులు, వ్యాపారస్తులు గమనించాలని ఆయన కోరారు.

ఈపాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి

కడ్తాల్: దుకాణదారులు ఈపాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల, విత్తన దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈపాస్ మెషీన్‌లో నమోదు వివరాలు, ఆయా దుకాణాల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. శ్రీలత మాట్లాడుతూ.. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈపాస్ ద్వారా పంటల సాగు వానాకాలానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

తలకొండపల్లి: ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించడంతో పాటు రైతులకు రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం, వెల్జాల్‌లోని శ్రీ ఆగ్రో రైతు కేంద్రం, న్యూ స్వామి ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, న్యూ ఓంసాయి సీడ్స్ ఫర్టిలైజర్స్ తదితర దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. .

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

షాబాద్: పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ గురువారం రైతులకు అందుబాటులో ఉన్నాయని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60శాతం సబ్సిడీపై షాబాద్ సహకార బ్యాంకు వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము 40 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1,448లు, జీలుగ 30 కిలోల బస్తా రూ.1,116లు రైతులు చెల్లించాలన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని విత్తనాలు తీసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షాద్‌నగర్: రాయితీపై విత్తనాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నిషాంత్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్‌లో ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం నుంచి 60శాతం రాయితీపై జనుము, జీలుగ, పచ్చిరొట్టె విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ పీఏసీఎస్ సెంటర్‌లో సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ సీఈఓ వినయ్ కుమార్ తెలిపారు. జనుము 40కిలోల బస్తా రూ.1,448లు, జీలుగ 30 కిలోల బస్తా రూ.1,116లు చెల్లించి తీసుకెళ్లాలన్నారు. ఒక ఎకరానికి ఒక బ్యాగ్ సరిపోతుందని చెప్పారు. కావల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని పీఏసీఎస్‌ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తహసీల్దార్‌కు అర్కపల్లి గ్రామస్తుల వినతి

మాడ్గుల: మండలంలోని అర్కపల్లిలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు మాడ్గుల తహసీల్దార్ సునీల్‌కు వినతి పత్రం ఇచ్చారు. తమ పంచాయితీ పరిధిలో చెరువు, కుంటలను కబ్జా చేస్తున్నారని తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాంకిషన్, గిరి, రామకృష్ణ, నరేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కిష్టఫర్


డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వైస్ చాన్స్‌లర్ కిష్టఫర్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కిష్టఫర్ పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగంలో ఎమర్జింగ్ ట్రేడ్స్ ఇన్ మెచిర్యూల్ ఫాండ్స్ విజ్ ఏ ఇన్వెస్టర్స్ పర్చేజెస్ ఏ సెలక్ట్ స్టడీ అనే అంశంపై డాక్టర్ కె వెంకటజనార్ధన్‌రావు పర్యవేక్షణలో ఆవుల సునీత పరిశోధనను పూర్తి చేశారు. దీంతో ఆమెకు బుధవారం డాక్టరేట్‌ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ కిష్టఫర్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి వైపు ఉన్నప్పుడే ప్రజల ద్వారా ఈ పరిశోధనలకు గుర్తింపు లభిస్తుందన్నారు. సునీత చేసిన పరిశోధన ప్రస్తుత కాలంలో వాణిజ్యం, వ్యాపార నిర్వహణ, కొనుగోలు, అమ్మకం వంటి విషయానికి సంబంధించిన పరిశోధన ఎంతో బాగుందని ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యదర్శి సంధ్య


గండిపేట చౌరస్తాలో చెత్తను తొలగింపజేస్తున్న పంచాయతీ కార్యదర్శి సంధ్య

మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని పంచాయతీ కార్యదర్శి సంధ్య పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆయా హోటల్స్, రోడ్ల ప్రక్కన చెత్తాచెదారం వేస్తే ఫెనాల్టీ తప్పదని పంచాయతీ కార్యదర్శి సంధ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గండిపేట చౌరస్తా మొదలుకొని హిమాయత్‌నగర్ వరకు ఆమె రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటల్ యజమానులు, వ్యాపారస్తులు పలువురు చెత్తను ప్లాస్టిక్ కవర్లల్లో తెచ్చి రోడ్డు ప్రక్కన వేయడం పరిసరాల పరిశుభ్రతకు విరుద్ధమని తెలిపారు. ఇలా వేస్తే సీసీ కెమెరాల ద్వారా పట్టుకొని ఫెనాల్టీ వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త!

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- దుకాణదారులు నిబంధనలు పాటించాలి
- వ్యవసాయ అధికారి వెంకటేశం


షాబాద్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు, మందులు

షాబాద్: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వివిధ రకాల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్త వహించాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం సూచించారు. విత్తనాలు, ఎరువులు, కొనుగోళ్లలో తగిన అప్రమత్తత అవసరమని ఆయన పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. విత్తన విక్రేతల దుకాణాలపై నిఘా ఉంచారన్నారు. ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులు పరిశీలిస్తున్నారు. విక్రేతలతో మాట్లాడి నిబంధనలు కచ్చితంగా పాటించాలని తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు దుకాణం నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. దీన్ని భద్రపర్చుకోవాలి.
- ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లులపై విత్తన కంపెనీ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీలు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.
- బిల్లులపై దుకాణం ముద్ర ఉండేలా చూడాలి. విత్తనాల మొలక శాతం, తేమ శాతం కచ్చితంగా దుకాణదారులను అడగాలి.
- విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలున్నా, తడిసినా కొనుగోలు చేయొద్దు. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతం చూసుకోవాలి.
- విత్తన సంచులపై ప్రామాణికాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉన్నాయో? లేవో? చూసి కొనాలి.

దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు...

- దుకాణం ఎదుట ధరల వివరాలు బోర్డుపై పొందుపరచాలి.
- అక్కడ లభించే విత్తనాలు, రకాలను డీలర్ల వివరాలు పేర్కొనాలి.
- దుకాణం లైసెన్స్ వినియోగదారులకు కనిపించేలా ఉండాలి. స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల వివరాల బుక్స్ రిజిస్టర్ నిర్వహించాలి.
- విత్తనాలు, ఎరువుల విక్రయాలు, కంపెనీల పూర్తి వివరాలన్నీ నిత్యం వ్యవసాయశాఖకు తెలపాలి.


వెంకటేశం, వ్యవసాయాధికారి